సాక్షి
జోగులాంబ గద్వాల
గురువారం । 28 । నవంబర్ । 2024



పెరిగిన ఉల్లి ధర

దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లిపాయల వేలంలో ధరలు ఒక్కసారిగా పెరిగాయి.

వివరాలు 8లో ▸



దేశానికే ఆదర్శంగా..

కొల్లాపూర్‌ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.1/12.6

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం, రాత్రివేళ చలి ఉండటంతో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

వేరుశనగ క్వింటా రూ.6,979

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు బుధవారం 313 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్ఠం రూ.6979, కనిష్ఠం రూ.3569, సరాసరి రూ.5289 ధరలు పలికాయి. అలాగే, 30 క్వింటాళ్ల ఆముదాలు రాగా గరిష్ఠం రూ.5659, కనిష్ఠం రూ.5419, సరాసరి రూ.5655 ధరలు లభించాయి. 1741 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్ఠం రూ. 2710, కనిష్ఠం రూ.1902, సరాసరి ధరలు రూ.2624 పలికాయి.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



మల్దకల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేసి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి డాక్టర్ ప్రియాంక ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని పాల్వాయి, అమరవాయి హైస్కూళ్లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో విద్యార్థులు శ్రద్ధతో చదువుకుని మంచి ఉత్తీర్ణతను సాధించాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతో పాటు ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రతి రోజుమెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్, ప్రధానోపాధ్యాయులు నరేష్, నరసింహాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



గద్వాలటౌన్: సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, అప్పటి వరకు మినిమమ్ టైమ్ స్కేల్ కల్పించాలని తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో జిల్లాలోని అన్ని కేజీబీవీల ఎదుట సమగ్ర శిక్ష పరిధిలోని సీఆర్పీలు, సీఆర్టీలు, నాన్ టీచింగ్ స్టాఫ్, ఇతర సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయా కేజీబీవీల వద్ద పలువురు మాట్లాడారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.20 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షలు కల్పించాలన్నారు. పదవీ విరమణ పొందిన వారికి రూ.25 లక్షలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజీ కల్పించాలన్నారు. తమ సమస్యలపై వివిధ దశల్లో నిరసనలు తెలుపుతామని, సమస్య పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసనకు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

కౌలు రైతు కన్నీరు

విధిలేక ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు పత్తి విక్రయం

- సీసీఐ నిబంధనలపై అసహనం
- ఎకరాకు 12 క్వింటాళ్ల నిబంధనతో నష్టపోతామని ఆవేదన
- నల్లరేగడి పొలంలో 15 నుంచి 24 క్వింటాళ్ల దాకా దిగుబడి



మానవపాడులో కౌలు రైతు పండించిన పత్తిని ప్రైవేట్ వ్యక్తులకు విక్రయిస్తున్న రైతులు

మానవపాడు: ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి పంట చేతికొచ్చే సమయానికి సరైన ధర లేకపోవడం, సీసీఐ పెట్టే నింబంధనలతో కౌలు రైతు కన్నీరు పెట్టే దుస్థితి నెలకొంది. ఎంత దిగుబడి వచ్చినా ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పడం.. చలి తీవ్రత పెరిగి పత్తిలో తేమ శాతం పెరగడంతో ధరలో కోత విధించడం.. అసలు కౌలు రైతులకు టోకెన్లే ఇవ్వకపోవడం.. మొత్తంగా పత్తి సాగు చేసిన కౌలు రైతుకు కష్టాలు చుట్టుముట్టాయి. ఇక విధిలేని పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు పత్తిని విక్రయించి నష్టాలు మూటగట్టుకోవాల్సి వస్తోంది. నియోజకవర్గంలో అలంపూర్, ఉండవెల్లి, మానవపాడు, ఇటిక్యాల, అయిజ, రాజోలి, వడ్డేపల్లి, ఎర్రవళిచౌరస్తాలు ఉండగా.. వీటి పరిధిలో దాదాపు 7500 నుంచి 8వేల దాకా పత్తిపంటను రైతులు కౌలుకు తీసుకొని సాగు చేశారు. వీరంతా ప్రస్తుతం సీసీఐ ద్వారా పత్తిని అమ్ముకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేట్ వ్యక్తులకు క్వింటా రూ.6600 విక్రయించడంతో దాదాపు రూ.900 దాకా రైతులు నష్టపోతున్నారు. పంట పెట్టుబడి కోసం చేసిన అప్పుల వడ్డీలు పెరిగిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. ఎకరాకు దాదాపు 15 నుంచి 20 క్వింటాళ్లు పత్తి పడించిన రైతుకు దాదాపు రూ.15వేల నుంచి రూ.18వేల దాకా నష్టం వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులు పండించిన పత్తి పంటను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

తేమ పేరుతో తగ్గింపు

పత్తిలో 8 శాతం తేమ ఉన్న ఏ గ్రేడ్ పత్తి క్వింటాకు రూ.7521, 9 శాతం నుంచి 12 శాతం వరకు తేమ ఉంటే ఒక్కో శాతానికి రూ.75 తక్కువగా కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ధాన్యం మాదిరిగా పత్తిని ఆరబెట్టుకునే అవకాశం ఉండదు. మార్కెట్‌కు అమ్మకానికి తెస్తే.. అమ్మితే సీసీఐకి లేదంటే ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకొని ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకసారి ఇంటి నుంచి వాహనంలో తెచ్చిన పత్తిని మళ్లీ తీసుకువెళ్లాలంటే వాహనాలు, కూలీలు ఖర్చు తడిసి మోపడవుంది. దీంతో క్వింటా పత్తికి రూ.వెయ్యి తక్కువ అయినా ప్రైవేట్ వ్యక్తులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక ఎకరాలో ఎంత పత్తి పండినా సీసీఐ మాత్రం 12 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తుంది.ఈ నిబంధనల వల్ల రైతులు నష్టపోతున్నారు. నియోజకవర్గంలో నల్లరేగడి సారవంతమైన భూములు ఉన్నాయి. సరైన వర్షాపాతం కురవడంతో ఒక్కో ఎకరాలో 15 నుంచి 18 క్వింటాళ్ల దాకా పత్తి దిగువడి వచ్చింది. సీసీఐలో 12 క్వింటాళ్ల చొప్పున విక్రయించి మిగతా పత్తిని ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించాల్సి వస్తోందని, ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి పత్తి సాగు చేసిన తమను ఆదుకోవాలని కౌలు రైతులు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి



నాకు 20 ఎకరాల పొలం ఉంది. దాంతోపాటు కొంత భూమిని కౌలుకు తీసుకొని దాదాపు 45ఎకరాల్లో పత్తి పంటను సాగు చేస్తున్నా. ఎకరాకు 18క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది. కానీ, కౌలుకు తీసుకున్న పొలంలోని పత్తిని సీసీఐ కేంద్రంలో కొనుగోలు చేయడంలేదు. దీంతో ప్రైవేట్ వ్యాపారులకు క్వింటా రూ.6400 విక్రయించి నష్టపోవాల్సి వస్తుంది. నిబంధనలు సడలించి కౌలు రైతులను ఆదుకోవాలి.

– మద్దిలేటి, రైతు, మానవపాడు

మొత్తం పంటను కొనుగోలు చేయాలి



సీసీఐ ద్వారా కౌలు రైతు పండించిన పత్తిని సైతం కొనుగోలు చేయాలి. నేను దాదాపు 10 ఎకరాల్లో పత్తి సాగు చేశాను. ఇప్పటి దాకా 70 క్వింటాళ్ల పత్తి దిగుబడి రాగా క్వింటాకు రూ.6200 చొప్పున విక్రయించా. మరో 80 క్వింటాళ్ల పత్తి విక్రయానికి ఉంది. ప్రభుత్వం సీసీఐ ద్వారా కౌలు రైతు పడించిన పత్తిని కొనుగోలు చేయాలి.

– మద్దిలేటి, రైతు, చెన్నిపాడు

ఆన్‌లైన్ సమస్యతో నిలిపివేశాం

ఆన్‌లైన్ సమస్యతో కౌలు రైతు పండించిన పత్తి పంటను కొనుగోలు చేయడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం త్వరలోనే కొనుగోళ్లు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– ఎల్లస్వామి, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి, అలంపూర్

నేటినుంచి రైతు పండుగ

తొలిరోజు ప్రారంభించనున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఏర్పాట్లపై చర్చిస్తున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తదితరులు

- 30న సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరు
- ప్రతిరోజు 5 వేల మంది రైతులు పాల్గొనేలా చర్యలు
- 150 స్టాళ్ల ద్వారా అవగాహన కార్యక్రమాలు
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజాపాలన పేరిట విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో రైతు పండగ పేరిట మూడు రోజుల పాటు ప్రత్యేక రైతు సదస్సు జరపనుంది. ఇందుకోసం భూత్పూర్ మండలం అమిస్తాపూర్‌లో రైతు పండగ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. కలెక్టర్ విజయేందిర ఆధ్వర్యంలో జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందర్‌రావు పర్యవేక్షిస్తున్నారు. అలాగే ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి ఏర్పాట్ల గురించి అధికారులతో వివరాలు తెలుసుకుంటున్నారు.

రైతువేదికల్లో ప్రత్యక్ష ప్రసారం

జిల్లాలో జరగనున్న మూడు రోజుల రైతు సదస్సు కార్యక్రమాలను రైతులు, ప్రజలు తిలకించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 560 రైతువేదికల్లో ప్రత్యేక ప్రసారాలు చేయనున్నారు. సదస్సులో ఆదర్శ రైతుల ప్రసంగాలు, ఆధునిక వ్యవసాయ విధానాలపై వివరణలు, వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి, మత్స్య శాఖ తదితర రంగాలకు చెందిన ఆదర్శ రైతులచే ప్రసంగాలు, విజయగాధలపై వీడియో ప్రదర్శనలు ఉంటాయి. ఒక్కొక్క పంటకు సంబంధించిన రైతులను గుర్తించి వారి అనుభవాలు వివరిస్తారు.

ముగ్గురు మంత్రులు..

గురువారం ఉదయం 10 గంటలకు రైతు సదస్సును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభిస్తారు. తొలిరోజు సదస్సుకు ఉమ్మడి జిల్లాకు చెందిన రైతులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు.

- శుక్రవారం రెండోరోజు రాష్ట్ర నలుమూలల నుంచి రైతులు హాజరు కానున్నారు. సుమారు 5 వేల మంది రైతులు పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు.
- శనివారం మూడోరోజు రైతు సదస్సు కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి సభ ఉంటుంది. ఈ సభకు సుమారు లక్ష మంది రైతులు పాల్గొనేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపడుతున్నారు.

భోజన వసతి..

రైతు పండగకు వచ్చే రైతులు, ప్రజాప్రతినిధులల కోసం భోజన వసతి కూడా కల్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్దఎత్తున వచ్చే రైతుల కోసం అవసరమైన మౌలిక సదుపాయాలు, భోజనం, తాగునీరు ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమానికి రాష్ట్రంలోని మంత్రులు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. రైతు సదస్సు ఏర్పాట్లను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు పరిశీలించారు.

రైతు పండగలో ఏర్పాటు చేసిన స్టాళ్లు



150 స్టాళ్లు ఏర్పాటు..

రైతు పండగ సందర్భంగా వేదికలో 150 స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ రైతు పండగలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో అన్ని రైతులకు సంబంధించిన అంశాలపై ప్రదర్శన, శిక్షణ, అవగాహన, ప్రత్యేకించి వ్యవసాయ రంగంలో వస్తున్న ఆవిష్కరణలు, వ్యవసాయ యాంత్రీకరణ, విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, విత్తనోత్పత్తులు, హార్టికల్చర్, ఆడ్రిప్ అగ్రికల్చర్, వరి నాట్లు వేసే పరికరాలు ఇలా అన్నింటిపై రైతులకు అవగాహన కల్పించేలా స్టాళ్లు ఏర్పాటు చేశారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రైతును రాజు చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన అమిస్తాపూర్‌లో రైతు పండగ ఏర్పాట్లను పరిశీలించి.. కలెక్టర్ విజయేందిరను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రైతు స్టాళ్లు, అవగాహన సదస్సు వేదిక, పబ్లిక్ మీటింగ్ ఏర్పాట్లు, రాష్ట్రంలోని నలుమూలల నుంచి రానున్న రైతులకు వాహన పార్కింగ్, భోజన ఏర్పాట్లను పరిశీలించి.. పకడ్బందీగా చేయాలని సూచించారు. రైతులు పండించిన పంటలను ప్రదర్శించుకోడానికి దాదాపు 120 స్టాళ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు స్టాళ్లు పరిశీలించిన తర్వాత వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, మేధావులు అవగాహన కల్పిస్తారన్నారు. రైతు పండగను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బంగారు భవిష్యత్‌కు ఎన్‌సీసీ మార్గనిర్దేశం



ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

గద్వాలటౌన్: విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఎన్‌సీసీ మార్గనిర్దేశం చేయడంతోపాటు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతుందని కలెక్టర్ సంతోష్ పేర్కొన్నారు. 8వ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో 77వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని గురువారం స్థానిక ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఉన్నత ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని అన్నారు. ఐక్యతే విజయాలకు బాట వేస్తుందని, అందుకే ఎన్‌సీసీ ఐక్యత, క్రమశిక్షణను నూరిపోస్తుందన్నారు. ఎన్‌సీసీ శిక్షణ పొందిన వారు ఏ రంగంలోనైనా రాణించగలుగుతారని పేర్కొన్నారు. ఎన్‌సీసీ వలన విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు దేశభక్తి, నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. ఉత్తమ పౌరులుగా ఎదగటానికి ఎన్‌సీసీ దోహదం చేస్తుందని చెప్పారు. క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ విద్య సంవత్సరంలోనే ఎన్‌సీసీ శాఖను ఏర్పాటు చేసి చక్కని పనితీరును కనబరుస్తూ విజయాలను సాధిస్తోందని కితాబిచ్చారు. అంతకుముందు ఎన్‌సీసీ పతాకాన్ని ఆవిష్కరించి, విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. సందర్భంగా ఎన్‌సీసీ కేడెట్ల పరేడ్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ కాంతమ్మ, హెచ్‌ఎం వెంకటనర్సయ్య, ఎన్‌సీసీ అధికారి రాముడు పాల్గొన్నారు.

ఈవీఎంలు అత్యంత సురక్షితం

గద్వాల: ఎన్నికల నిర్వహణకు వినియోగించే ఈవీఎంలు అత్యంత సురక్షితమని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. ఈమేరకు ఆయన బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈవీఎంల పనితీరు, ట్యాంపరింగ్ చేసే అవకాశముందని పేర్కొంటూ తిరిగి బ్యాలెట్ పేపర్ అమల్లోకి తీసుకురావాలని కొందరు వ్యక్తులు ఇటీవల సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారని, ఈ పిల్‌ను పరిశీలించిన సుప్రీంకోర్టు ధర్మాసనం కేసును కొట్టివేసినట్లు తెలిపారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు విక్రమ్‌నాథ్, పి.బి.వరాలే ఈపిల్‌పై విచారణ జరిపిన అనంతరం పిటీషన్‌ను కొట్టివేస్తూ సంచలన తీర్పు వెలువర్చినట్లు తెలిపారు. ఈ తీర్పు ఈవీఎంల విశ్వసనీయతకు నిదర్శమని తెలిపారు. ఓటమి పాలైనప్పుడు మాత్రం ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తపర్చడం సరికాదని, ఈతీర్పు ఈవీఎంల విశ్వసనీయతకు మద్దతు ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందనటానికి రుజువుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఓటర్లందరు ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించే ఎన్నికల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు.

జమ్ములమ్మ వేలం పాటలో కాంట్రాక్టర్ల సిండికేట్

- రూ.50.04 లక్షలకు టెంకాయల వేలం ఖరారు



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

గద్వాలటౌన్ : 2024–25 జమ్ములమ్మ ఉత్సవాలకు సంబంధించిన వివిధ వేలం పాటల వ్యవహారం సిండికేట్‌గా మారింది. గతేడాది కంటే కొంత ఎక్కువ ధరకు పాట పాడి వేలాన్ని పొందాలకున్న కాంట్రాక్టర్ల వ్యూహం ఫలించింది. కాంట్రాక్టర్ల రింగ్ యత్నాలు సాఫీగా సాగాయి. గురువారం జమ్ములమ్మ ఆలయ కార్యాలయంలో అధికారులు వెంకటేశ్వరి, పురందర్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది టెంకాయలు, కొబ్బరి చిప్పలు, అమ్మవారి చీరలకు సంబంధించిన బహిరంగ వేలంపాట నిర్వహించారు. వేలం పాటకు ముందు కాంట్రాక్టర్ల మధ్య రాజీ కుదర్చటానికి కొంత మంది పెద్దలు ప్రయత్నించారు. అందుబాటులోని అన్ని మార్గాలను అనుసరించారు. కార్యాలయ ఆవరణలోనే సుమారు గంటపాటు వేలంపాట కోసం తీవ్రంగా మంతనాలు జరిపారు. గత సంవత్సరం కంటే కొంత ఎక్కువగా పాట పాడి టెంకాయల వేలం సొంతం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే మొదట గుడ్‌విల్ విషయంలో కాంట్రాక్టర్ల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. అనంతరం మరోసారి గుడ్‌విల్ విషయంపై కాంట్రాక్టర్లు మంతనాలు సాగించి మొత్తానికి ఏకాభిప్రాయం కుదిరింది. వేలం దక్కించుకున్న కాంట్రాక్టర్ పోటీలో పాల్గొన్న మిగతా కాంట్రాక్టర్లకు ఒక్కొక్కరికి రూ.1.10లక్షలు గుడ్‌విల్ ఇచ్చే విధంగా ఒప్పందాలు జరిగినట్లు తెలిసింది. తెరవెనక ఉండి రింగ్ యత్నాలు నడిపించిన నాయకులకు అదనంగా మరో రూ.2 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరినట్లు సమాచారం. రింగ్ యత్నాలు ఫలించిన తర్వాత కాంట్రాక్టర్లు వేలంలో పాల్గొన్నారు.

అనుమానం రాకుండా..

అధికారులకు ఎవరికి అనుమానం రాకుండా కాంట్రాక్టర్లు వ్యూహాత్మకంగా టెంకాయల వేలం పాట పాడారు. గతేడాది కంటే 10శాతం అధికంగా టంకాయల వేలాన్ని పాడారు. మొత్తం 7 మంది కాంట్రాక్టర్లు వేలం పాటలో పాల్గొన్నారు. టెంకాయల వేలం గత ఏడాది రూ. 44.35 లక్షలకు దక్కించుకోగా.. ప్రస్తుతం రూ.50.04 లక్షలకు పులిపాటి నగేష్ అనే కాంట్రాక్టర్ పాట పాడి టెంకాయల వేలం సొంతం చేసుకున్నారు. గత సంవత్సరం మొత్తంలో కంటే పది శాతం అధికంగా ఉండటంతో టెంకాయల వేలం ఆమోదానికి అధికారులు మొగ్గు చూపారు. కొబ్బరి చిప్పల వేలం గతేడాది రూ. 11.67 లక్షలకు దక్కించుకోగా.. ప్రస్తుతానికి వచ్చే సరికి రూ.12.22 లక్షలకు ఓంప్రకాష్ కాంట్లే అనే కాంట్రాక్టర్ సొంతం చేసుకున్నారు. ఇందులో రూ.50 వేలు గుడ్‌విల్ రూపంలో చేతులు మారినట్లు తెలిసింది. మొదటిసారి నిర్వహించిన అమ్మవారి చీరల వేలం పాటను కాంట్రాక్టర్ రూ. 3.54లక్షలకు దక్కించుకున్నారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల వేళాలు వాయిదా పడ్డాయి. అధికార పార్టీలోని రెండు వర్గాలకు చెందిన నాయకులే వేలంపాటలో పాల్గొని సిండికేట్ కావడం విశేషం.

తిరుపతిరెడ్డి సేవలు వెలకట్టలేనివి

అలంపూర్: అలంపూర్ ఆలయాల కమిటీ మాజీ చైర్మన్ బడుగుల తిరుపతిరెడ్డికి ప్రముఖలు నివాళులర్పించారు. బుధవారం ఉండవెల్లి మండలం కలుగోట్లలో ఆయన దశ దిన కర్మ నిర్వహించారు. ఆయన జ్ఞాపకార్థం గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. హైదరాబాద్ చెందిన 50 మంది డాక్టర్లు 150 మంది చిన్నపిల్లలకు, దాదాపు 200 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అంతకుముందు తిరుపతిరెడ్డి చిత్రపటానికి ఆమె కుమార్తె, రాష్ట్ర ఐజీ బడుగుల సుమతితోపాటు ఐజీలు రమేష్ రెడ్డి, సత్యనారాయణ, ఎస్పీ శ్రీనివాస్‌రావు తిరుపతి రెడ్డి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, పోలీస్ ఉన్నతాధికారులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. ఆలయాలకు, గ్రామానికి ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివని పలువురు కొనియాడారు.



తిరుపతిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

చేనేత వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



రాజోళిలో మగ్గాలను పరిశీలిస్తున్న చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ తదితరులు

రాజోళి: చేనేత కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన పర్యటించారు. డిసెంబర్ 10వ తేదీన చేనేత ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్న క్రమంలో చేనేత కార్మికుల జీవితాలపై, జీవన విధానంపై వారు అధ్యయన యాత్ర చేస్తున్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులతో కలిసి రాజోళిలో చేనేత కార్మికుల ఇళ్లలో మగ్గాలను పరిశీలించారు. వారు నేస్తున్న చీరలు, వారికి అందుతున్న పథకాలను గురుంచి అడిగి తెలుసుకున్నారు. మోదీ అధికారంలోకి వచ్చాక హ్యాండ్‌లూమ్స్ టెక్స్‌టైల్స్ బోర్డు, హ్యాండీ క్రాఫ్ట్, మహాత్మాగాంధీ బూనకర్ యోజన పథకాన్ని రద్దు చేశారని అన్నారు. గత ప్రభుత్వాలు చేనేత వస్త్ర పరిశ్రమపై జీఎస్టీలు విధించలేదని, మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీఎస్టీతో చావు దెబ్బ తీశారన్నారు. 2013–14 లో యుపీఏ ప్రభుత్వం రూ.2వేల కోట్లు నిధులు చేనేత కార్మికులకు కేటాయించగా.. మోదీ ప్రభుత్వం నేటి వరకు రూ.200 కోట్లు మాత్రమే కేటాయించిందని అన్నారు. చేనేత సంక్షేమ బోర్డుకు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మూషం నరహరి, నాయకులు వర్కాల చంద్రశేఖర్, రాజోళి చేనేత సహకార సంఘం ఇంచార్జ్ దొత్రే శ్రీనువాసులు, బాబు, వంకా మహేష్, సోమశేఖర్, గోపాల్, గోవిందు, రాము పాల్గొన్నారు.

క్లుప్తంగా

హైదరాబాద్‌లో కొట్రవాసి ఆత్మహత్య


నరేష్(ఫైల్)

వెల్దండ: మండలంలోని కొట్ర గ్రామానికి చెందిన మాడుగుల నరేష్(35) అనే వ్యక్తి మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో తన ఇంట్లో ఉరేసుకున్నాడు. వివరాలు.. నరేష్ ఎనిమిదేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన ప్రియాంకను ప్రేమ వివాహం చేసుకున్నాడు. అక్కడే పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ సమస్యలతో ఇబ్బందులు పడేవాడు. ఈనేపథ్యంలో మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం రాత్రి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. మృతుడికి భార్య ప్రియాంక, ఒక కుమారుడు ఉన్నారు. .

కేజీబీవీలో విద్యార్థినిపై నూనె పడి గాయాలు


గాయపడిన విద్యార్థిని జల్సా

నవాబుపేట: స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయంలో 9వతరగతి చదువుతున్న విద్యార్థిని చేతిపై నూనె పడి గాయాలయ్యాయి. వివరాలు.. బుధవారం పాఠశాల విద్యార్థినులకు అల్పాహారం కోసం పూరీలు సిద్ధం చేస్తున్నారు. వంట వారికి సహకరిస్తున్న జల్సా అనే విద్యార్థిని చేతిపై నూనె పడింది. దీంతో ఎడమచేతి రెండువేళ్లకు, కుడికాలుకు బొబ్బలెక్కాయి. సిబ్బంది వెంటనే ప్రాథమిక చికిత్స అందించి నవాబుపేట ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రశాంతి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు కేజీబీవీకి చేరుకుని తమ కూతురుతో వంటశాలలో ఎందుకు పనిచేయించుకుంటున్నారని నిలదీశారు.

హాస్టల్ విద్యార్థికి..

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థి మహేష్‌కు గాయాలయ్యాయి. చిన్నచింతకుంట మండలం దాసర్‌పల్లికి చెందిన మహేష్ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. బుధవారం ఉదయం హాస్టల్ వద్ద మరుగుదొడ్డికి వెళ్లే క్రమంలో కిందపడ్డాడు. తలకు గాయాలై రక్తస్రావమైంది. హాస్టల్ సిబ్బంది మహేష్‌ను బస్టాండ్ సమీపంలో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మహేష్ తలకు మూడు కుట్లు వేసి వైద్యులు చికిత్స చేశారు.

రోడ్డు దాటుతుండగా ఢీకొట్టిన కారు

- ఒకరి మృతి.. మరో మహిళకు గాయాలు

అడ్డాకుల: మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి ఇద్దరు మహిళలు రోడ్డు దాటుతుండగా ఓ కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓ మహిళ మృతి చెందగా.. మరొకరు గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు.. హైదరాబాద్‌కు చెందిన బి.మల్లీశ్వరి(33), శ్రీలత తిమ్మాయిపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు అడ్డాకులకు వచ్చారు. ఇక్కడ రహదారిని దాటుతుండగా వారిని హైదరాబాద్ వైపు నుంచి అనంతపూర్ వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లీశ్వరి అక్కడికక్కడే మృతి చెందింది. మరో మహిళ శ్రీలతకు గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

29న ఉమ్మడి జిల్లా వాలీబాల్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–19 విభాగాల వాలీబాల్ బాల, బాలికల ఎంపికలను శుక్రవారం కోస్గి సమీపంలోని గుండుమాల్ ఏకే వాలీబాల్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థులు ఇంటర్ ఒరిజినల్ బోనోఫైడ్, ఎస్‌ఎస్‌సీ మెమో జిరాక్స్‌తో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాల కోసం కోచ్ సాధిక్ సెల్ నం .95057 24168ను సంప్రదించాలని ఆయన సూచించారు.

గురుకులంలో విద్యార్థి బలవన్మరణం

కూలీనాలీ చేసుకునే బతుకులు వాళ్లవి.. చదువు సంధ్య లేదు.. తమ బిడ్డనైన మంచి చదువులు చదివించి ఉన్నతస్థాయికి చేర్చాలని కలలు కన్నారు.. అందుకోసం గురుకుల పాఠశాలలో చేర్పించారు.. కానీ వారి ఆశలు అడియాశలయ్యాయి.. ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన ఆచిన్నారికి ఏం కష్టం వచ్చిందో.. 13 ఏళ్లకే బలవన్మరణానికి పాల్పడి తనువు చాలించాడు.. తల్లిదండ్రులకు కడుపు కోత మిగిల్చాడు.. ఈ హృదయ విదారక ఘటన బుధవారం మదనాపురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది.


ఆందోళన చేస్తున్న అఖిల పక్ష నాయకులు

ఫ్యాన్‌కు ఉరేసుకున్న చిన్నారి

- శోకసంద్రంలో తల్లిదండ్రులు
- కలకలం రేపిన ఘటన
- అఖిలపక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో
- వందల సంఖ్యలో నిలిచిపోయిన వాహనాలు
- బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ

మదనాపురం: గురుకుల పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని కొన్నూరుకు చెందిన తప్పెట శ్రీనివాసులు, సత్యమ్మ దంపతులు. ఐదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం పిల్లలతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. చిన్నకుమారుడు ప్రవీణ్‌కు హైదరాబాద్‌లోని ఓగురుకుల పాఠశాలలో సీటు వచ్చింది. అక్కడే చదువుతుండగా తమ సొంత ఊరుకు రావాలన్న ఉద్దేశంతో మదనాపురం గురుకుల పాఠశాలలో ఆగస్టు నెలలో ప్రవీణ్‌ను చేర్పించారు. మంగళవారం తోటి విద్యార్థులతో ఆడుతుండగా చిన్నపాటి గాయం తగిలింది. ఈ విషయాన్ని తండ్రికి ఫోన్ చేసి చెప్పాడు. బుధవారం బాబాయిని పంపిస్తానని బుజ్జగించినట్లు తెలిసింది. టిఫిన్ చేసిన తరువాత తల నొప్పిగా ఉందని చెప్పి గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు దుప్పటితో ఉరేసుకున్నాడు. తోటి విద్యార్థులు గమనించి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు చెప్పారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న విద్యార్థిని వారు హుటాహుటిన స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

మానవత్వం చాటిన విద్యార్థులు

అంబులెన్స్‌ను చూడగానే ఆ విద్యార్థులు మానవత్వం చాటారు. రాస్తారోకో నిర్వహిస్తున్న సమయంలో కొత్తకోట నుంచి 108 వాహనం రావడంతో అందరూ పక్కకు జరిగి దారి ఇచ్చి పంపించారు. మరో అరగంట తరువాత ఓ ప్రైవేటు ఆసుపత్రి అంబులెన్స్ రోగిని తీసుకురాగా దానికి కూడా దారి ఇచ్చారు.

అఖిలపక్ష నాయకుల రాస్తారోకో

ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతోనే విద్యార్థి మరణించాడని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ గ్రామస్తులు, బంధువులు, అఖిలపక్షం నాయకుల ఆధ్వర్యంలో వనపర్తి ఆత్మకూరు రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రెండున్నర గంటల పాటు రాస్తారోకో కొనసాగింది. వందల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా, రెండు ఎకరాల భూమి, ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ ప్రాంతమంతా ఉద్రికత వాతావరణం నెలకొన్నది. పాఠశాలలో మౌలిక వసతులల్లేవని, మంచినీటి వసతి లేదని పాఠశాలలో వాతావరణం అపరిశుభ్రంగా ఉందని ధర్నాలో పాల్గొన్న విద్యార్థులు నినాదాలు చేశారు. రాత్రివేళలో పాములు, తేళ్లు వస్తున్నాయని విద్యార్థుల ప్రాణా లకు ప్రమాదం పొంచి ఉందన్నారు. అక్కడికి చేరుకున్న తహసీల్దార్ అబ్రహం లింకన్ ఆందోళన విరమించాలని కోరారు. కలెక్టర్ వచ్చేంతవరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. దీంతో తహసీలల్దార్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు.బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని, చిన్నారి మృతిపై విచారణ జరిగి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. 2019లో ఇదే పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న శ్రీకాంత్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు.


విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న భవనం

హత్య కేసుల్లో ఆరుగురికి జీవిత ఖైదు

- ఒక్కొక్కరికి రూ.3500 జరిమానా
- ఎస్పీ శ్రీనివాసరావు


జీవితఖైదీలను జిల్లా జైలుకు తరలిస్తున్న గద్వాల పోలీసులు

గద్వాల క్రైం: రెండు హత్య కేసుల్లో ఆరుగురికి జీవితఖైదు పడింది. ఒక్కొక్కరికి రూ.3500 జరిమానా విధిస్తూ జడ్జి కే.కుష బుధవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. వివరాలు.. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం చెన్నిపాడుకి చెందిన పెద్ద కుర్మన్న 2012లో గ్రామంలో గణేష్ విగ్రహ ఏర్పాటు విషయంలో అదే గ్రామానికి చెందిన వరికుంట్ల ప్రసాద్‌తో గొడవ జరిగింది. పాత కక్షలు మనస్సులో పెట్టుకున్న ప్రసాద్ 2014 మార్చిలో పెద్దకుర్మన్న సోదరుడు మహేశ్‌ను కత్తులు, కర్రలతో దాడి చేసి హతమర్చారు. వరికుంట్ల ప్రసాద్, రామాంజనేయులు, ప్రకాష్, గంగారాజు, గర్కరాజు, ప్రవీణ్‌పై కేసు నమోదైంది. ఈ కేసు మహబూబ్‌నగర్ కోర్టులో కొనసా గుతుంది. ఈక్రమంలో పెద్ద కుర్మన్న కేసును నడిపిస్తున్నట్లు ప్రత్యర్థులు గుర్తించారు. ఎలాగైనా కేసును నడిపిస్తున్న వ్యక్తిని హత్య చేయాలనుకున్నారు. ఫిబ్రవరి 2, 2016లో గ్రామంలో కాలకృత్యాల కోసం పోతులపాడు రోడ్డు మార్గంలో వెళ్తున్న పెద్దకుర్మన్నను వెంటాడి దారుణంగా హత్య చేశారు. పై రెండు కేసులపై మానవపాడు పోలీస్‌స్టేషన్‌లో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. గద్వాల జిల్లా కోర్టులో బుధవారం కేసుపై వాదనలు నడిచాయి. సాక్షుల వాంగ్మూలం అనంతరం జిల్లా జడ్జి ఆరుగురు నిందితులకు జీవితఖైదు, ఒక్కొక్కరికి రూ.3500 జరిమానా విధించారు. ఈకేసులో కీలకంగా వ్యవహరించిన గద్వాల డీఎస్పీ సత్యనారాయణ, సీఐ టాటబాబు, అప్పటి సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కోర్టు పీపీలు వినోద్‌కుమార్, ఆనంద్, కోర్టు కానిస్టేబుల్‌లను సైతం అభినందించారు. నిందితులను జిల్లా జైలుకు తరలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

పెరిగిన ఉల్లి ధర

- గరిష్టంగా రూ.4550
- కనిష్టంగా రూ.2600


ఉల్లిని వేలం వేస్తున్న వ్యాపారులు

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లిపాయల వేలంలో ధరలు ఒక్క సారిగా పెరిగాయి. మార్కెట్ డిమాండ్‌కు తగ్గట్లు ఉల్లి దిగుబడులు లేక పోవడంతో ధరలు వారం వారం పెరుగుతూనే ఉన్నాయి. కర్నాటక, మహారాష్ట్ర నుంచి దిగుబడులు పెరిగితే ఉల్లి ధరలు తగ్గే అవకాశం ఉంది.

ధరలు అటు ఇటుగా..

ఉల్లి ధరలు ఒక వారం తగ్గుతున్నట్లు కనిపించినా మళ్లీ ధరలు పెరిగి పుంజుకుంటున్నాయి. మూడు వారాల క్రితం ఉల్లి ధర క్వింటాల్ గరిష్టంగా రూ. 3600 వరకు పలికింది. రెండు వారాల క్రితం రూ.2700కు పడి పోయింది. తిరిగి గత వారం ధర రూ. 3990 వరకు ధర పెరిగింది. ఈవారం ఏకంగా ఉల్లి ధర రూ. 4550కు చేరింది. ఇలా వారం వారం ధరల హెచ్చు తగ్గులతో ఉల్లి మార్కెట్ ఆటుపోట్లకు గురవుతున్నది.

45 కేజీల బస్తా రూ.2300

దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన బహిరంగ వేలంలో ఉల్లి ధర గరిష్టంగా క్వింటాల్‌కు రూ.4550 గా ధర వచ్చింది. కనిష్టంగా రూ. 2600 లకు పలికింది. మార్కెట్ నిబంధనల ప్రకారం 45 కేజీల ఉల్లి బస్తా ధర గరిష్టంగా రూ. 2300కు విక్రయించారు. కనిష్టంగా రూ.1300కు బస్తాగా అమ్మకాలు సాగించారు. మధ్యస్తంగా రూ. 1800 లకు బస్తాగా విక్రయించారు. ఉల్లి తక్కువ మొత్తంలో రావడంతో వ్యాపారులు పోటీపడి ఉల్లిని కొనుగోలు చేశారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక


వెన్నెలను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

కోస్గిరూరల్: అంగన్‌వాడీ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల తప్పిపోయిన బాలిక తల్లిదండ్రుల చెంతకు చేరిన సంఘటన బుధవారం పట్టణంలో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని టీచర్ కాలనీకి చెందిన వెంకటాచారి తన కూతురు వెన్నెలను ఎప్పటిలాగే అంగన్‌వాడీ కేంద్రంలో విడిచి పనికి వెళ్లాడు. నిర్వాహకులు నిర్లక్ష్యంతో బాలిక బయటకు వెళ్లి బస్టాండ్ సమీపంలో ఏడుస్తూ ఉన్నది. వివరాలు చెప్పక పోవడంతో కొందరు బాటసారులు 100కు డయల్ చేయగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బాలికను స్టేషన్ తీసుకెళ్లారు. ఈ విషయం వాట్సప్‌లో చెక్కర్లు కొట్టడంతో తల్లిదండ్రులకు తెలిసి పోలీస్‌స్టేషన్‌కు చేరారు. వెన్నెల తమ కూతురు అని సంబంధిత వివరాలు చూపడంతో తల్లిదండ్రులకు బాలికను అప్పగించడంతో కథ సుఖాంతమైంది.

అటెండర్‌ది హతా? ఆత్మహత్యా?

బిజినేపల్లి: ఈనెల 25న బిజినేపల్లి మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామ సమీపంలో కేఎల్‌ఐ కాల్వలో లభ్యమైన మృతదేహానికి సంబంధించి హత్య చేశారా? ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. తూడుకుర్తి గ్రామానికి చెందిన జగదీష్ బిజినేపల్లి మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల డిప్యుటేష్‌పై జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయానికి వచ్చి అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడి మృతదేహం కేఎల్‌ఐ కాల్వలో ఈనెల 25న లభ్యమవడంతో కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. జగదీష్ భార్యతో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెల్సింది. ఈ విషయంపై సీఐ కనకయ్యగౌడ్‌ను వివరణ కోరగా, కేసు విచారణ చేస్తున్నామని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



మరికల్: మండల కేంద్రంలో తాళం వేసిన ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. మరికల్‌కు చెందిన హోంగార్డు బోయ తిరుపతయ్య మంగళవారం కుటుంబ సభ్యులతో ఇంటికి తాళం వేసి మహబూబ్‌నగర్‌కు వెళ్లాడు. ఇంటికి వేసిన తాళంను దొంగలు విరగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువా తాళం తొలగించి అందులో ఉన్న రెండు తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలను అపహరించుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడు మరికల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శ్రీశైలంలో తగ్గుతున్న నీటిమట్టం

దోమలపెంట/ మదనాపురం: శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885.0 అడుగులు కాగా.. బుధవారం సాయంత్రం వరకు 868.0 అడుగుల వద్ద 133.6290 టీఎంసీల నీరు నిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. అలాగే పోతిరెడ్డిపాడు ద్వారా 7,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,611, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు.

రామన్‌పాడులో 1,021 అడుగులు

రామన్‌పాడు జలాశయంలో బుధవారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులు ఉంది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 390, సమాంతర కాల్వ ద్వారా 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో ఎన్టీఆర్ కాల్వ ద్వారా 735 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 25 క్యూసెక్కులు, వివిధ లిఫ్టుల ద్వారా 855 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

‘ఆసరా’ పొందుతున్న ఐకేపీ ఉద్యోగులు?

ఓ దిక్కు వేతనం.. మరో దిక్కు పింఛన్

- జిల్లాలో 24 మంది
- విచారణకు ఆదేశించిన సెర్ప్ సీఈఓ



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)లో పని చేస్తున్న కొందరు ఉద్యోగులు ఇటు వేతనంతో పాటు అటు సామాజిక భద్రత కింద ఇచ్చే ఆసరా పింఛన్లు పొందుతున్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఇటీవల సెర్ప్ సీఈఓ డీఆర్డీఓతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇందులో సీసీలు, మండల సమాఖ్య ఆపరేటర్లు, ఏపీఎంలు ఉన్నట్లు సమాచారం.

వేతనంతో పాటు ఆసరా పింఛన్లు పొందుతున్న ఉద్యోగులు జిల్లాలో 24 మంది ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఉద్యోగులు స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడం.. తిరిగి వాటిని వసూలు చేయడం, రికార్డులు నిర్వహిస్తూ ఆడిట్ చేయించాల్సి ఉంటుంది. సెర్ప్ ఉద్యోగులకు 2023, ఏప్రిల్ 1 నుంచి పే స్కేల్ ప్రకటించింది. సీనియార్టీ, క్యాడర్ వారీగా వేతనాలు ఉంటాయి. సీసీలను సైతం పర్మినెంట్ టెన్యూర్ ఎంప్లాయిగా పరిగణించింది. ప్రభుత్వం వారికి నెలకు రూ.24 వేల నుంచి రూ.27 వేల వరకు వేతనం చెల్లిస్తుంది. అయితే ప్రభుత్వం నుంచి వేతనం పొందే ఉద్యోగులు, సిబ్బంది ఎవరు కూడా సామాజిక భద్రత కింద ఆసరా పింఛన్ పొందే అవకాశం లేదు. ఒక వేళ అదనంగా ప్రభుత్వ ప్రయోజనాలు పొందితే దాన్ని అక్రమంగా భావించి వారిపై చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు..

జిల్లాలో 24 మంది ఉద్యోగులు ఆసరా పింఛన్లు తీసుకుంటున్నట్లు సెర్ప్ దృష్టికి వచ్చింది. ఇందులో 19 మందిని ఇప్పటికే తొలగించాం. ఇంకా ఐదుగురు ఉన్నారు. విచారణ పూర్తిచేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం. వారి ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.
– నర్సింహులు, డీఆర్డీఓ

భయాందోళనలో ఉద్యోగులు..

30 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య వయస్కులైన ఉద్యోగులు వృద్ధాప్య పింఛన్ పొందిన వారిలో ఉన్నట్లు సమాచారం. ఈ విషయం బయటకు రావడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారని.. ఉద్యోగుల్లో భయాందోళనలు మొదలైనట్లు తెలుస్తోంది. ఆసరా పింఛన్ల కోసం జిల్లాలో వేల సంఖ్యలో లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారు వేలల్లో ఉన్నారు.

విచారణకు ఆదేశం?

ఐకేపీ ఉద్యోగుల వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన సెర్ప్ సీఈఓ దివ్య సమగ్ర విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని డీఆర్డీఓను ఆదేశించినట్లు సమాచారం. బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. విధుల నుంచి సస్పెండ్ చేస్తారా.. లేక పింఛన్‌ను రూపంలో పొందిన మొత్తాన్ని రికవరీ చేస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది.

బాధితులకు న్యాయం చేయాలి

- సర్వే నం.523 క్రిస్టియన్‌పల్లి శివారు బాధితుల ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో క్రిస్టియన్‌పల్లిలోని సర్వే నెంబర్ 523లో ప్లాట్ల పట్టాలు ఉన్న వారి నుంచి అధికారులు పట్టాలు తీసుకుని, తగిన న్యాయం చేయడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. 523 సర్వే నెంబర్ బాధితులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా 523 నిర్వాసితుల కమిటీ అధ్యక్షురాలు పార్వతమ్మ మాట్లాడుతూ ఇంటిస్థలం పట్టాలు ఇస్తే డబుల్ బెడ్రూంలు ఇస్తామని హామీ ఇచ్చి తమతో ఒరిజినల్ పట్టాలు తీసుకున్నార న్నారు. జిల్లా కేంద్రంలో క్రిస్టియన్‌పల్లి శివారు యందు సర్వే నెంబర్ 523 పేదలకు 2004, 2012 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడు మండల రెవెన్యూ అధికారులు 2018 సంవత్సరంలో పేదల నుంచి ఒరిజినల్ పట్టా సర్టిఫికెట్స్ తీసుకొని మండల రెవెన్యూ ఆఫీసు నుంచి రశీదులు ఇచ్చారని తెలిపారు. ఇళ్ల పట్టాలు తీసుకొని ప్రభుత్వం న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసేదాకా పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం తహసీల్దార్ ఘంసీరాంనాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ పట్టణ కమిటీ గౌరవ అధ్యక్షులు భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి మంగమ్మ, కమిటీ సలహాదారులు రామ్మోహన్, వహీదా బేగం గోవిందమ్మ, మంజుల, శివలీల, అనురాధ, గౌసియా బేగం, సైదా బేగం, రహీం, పద్మ లలిత, దీప్తి, రబియా బేగం, అంజమ్మ, పర్వీన్, సుధాకర్, రాములు, షేక్ బాలే సాబ్, హబీబ్ అహ్మద్ పాల్గొన్నారు.

ఎక్కడికీ పోలేదు.. డెన్‌లోనే ఉన్నా

సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ



సాక్షి, హైదరాబాద్: 'నేను ఎక్కడికీ పోలేదు. డెన్‌లోనే ఉన్నా'అని ప్రముఖ సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కేసు నమోదైన నేపథ్యంలో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారని ప్రచారం కావటంతో బుధవారం ఆర్జీవీ హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. 'నా వృత్తి సినిమాలు తీయటం. అనేక రకాల నేపథ్య కథలతో సినిమాలు తీస్తూ వచ్చాను. నా కెరీర్‌లో అత్యధికం నిజ జీవిత కథల ఆధారంగానే వచ్చాయి. సినిమాల్లో కొన్ని పాత్రలను వ్యంగ్యంగా చూపించాల్సి వస్తుంది. అంత మాత్రానికే కేసులు పెట్టి, అరెస్ట్ చేస్తామంటే అంతకు మించిన దారుణం మరొకటి ఉండదు'అని వర్మ అన్నారు. ఉద్దేశపూర్వక కేసులకు భయపడేది లేదని, అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుందని పేర్కొన్నారు.

నేడు వైఎస్ జగన్ మీడియా సమావేశం

సాక్షి, అమరావతి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం పాత్రికేయ సమావేశం నిర్వహించనున్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు ఈ సమావేశం జరగనుంది.

కేంద్ర కార్యదర్శిగా ఏవీఎస్ రమేశ్‌చంద్రకు పదోన్నతి



సాక్షి, హైదరాబాద్: ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్‌ఎస్)కు చెందిన డాక్టర్ ఏవీఎస్ రమేశ్ చంద్రకు కేంద్ర ప్రభుత్వ కార్యదర్శిగా పదోన్నతి లభించింది. కేంద్ర కార్యదర్శి హోదాలో విదేశీ వ్యవహారాల బాధ్యతలను రమేశ్‌చంద్ర పర్యవేక్షించనున్నారు. ఇప్పటికే ఆయన భారత రాయబారిగా తుర్కియే, ఉగాండా వంటి 10 దేశాల్లో సేవలందించారు. ఏపీ, తెలంగాణకు నోడల్ అధికారిగా విదేశీ వ్యవహారాలను కూడా ఏవీఎస్ చూశారు. నాగార్జున్‌సాగర్ ఏపీఆర్‌జేసీలో ఇంటర్ చదివిన రమేశ్‌చంద్ర... ఏపీ అగ్రికల్చర్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. పలు డిగ్రీల్లో గోల్డ్ మెడల్ అందుకున్న ఆయన కేంద్ర కార్యదర్శిగా పదోన్నతి పొందడంపై బంధుమిత్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇవేం నేరారోపణలు?

ప్రముఖ న్యాయ కోవిదుడు, మాజీ అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీ

- కీలకమైన రెండు నేరారోపణల్లో అసలు అదానీల పేర్లే లేవు
- 'ఎఫ్‌సీపీఏ'ని ఉల్లంఘించారన్న నేరారోపణల్లో అదానీల పేర్లు లేవు
- అమెరికా 'డీఓజే' నేరారోపణలకు బలం చేకూర్చే విశ్వసనీయమైన ఆధారాలేవీ లేవు
- లంచం ఇవ్వటానికి ప్రయత్నించారని గానీ.. ఇచ్చారనిగానీ నిరూపించే కనీస సమాచారం లేదు
- ఆ నేరారోపణలన్నీ ఊహాజనితమైనవే..
- అందుకు ఎలాంటి ఆధారాలూ లేవు..
- ఈ విషయాలను మీడియా గమనించాలి



సాక్షి, అమరావతి: సౌర విద్యుత్ ప్రాజెక్టుల సంబంధించి అదానీ గ్రూపు లంచాలు ఇచ్చేందుకు కుట్ర పన్నిందంటూ యూఎస్ ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ) కింద అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ (డీఓజే) కేసు నమోదు చేయడాన్ని ప్రముఖ న్యాయ కోవిదుడు, మాజీ అటార్నీ జనరల్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ తప్పుబట్టారు. 'డీఓజే' చేసిన నేరారోపణలకు బలం చేకూర్చే విశ్వసనీయమైన ఆధారాలు ఏవీ లేవని ఆయన స్పష్టం చేశారు. ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ)ను ఉల్లంఘించారనే విషయంలో అదానీలపై ఎలాంటి నేరారోపణలు లేవన్నారు. అలాగే న్యాయాన్ని అడ్డుకున్నారన్న నేరారోపణలో కూడా అదానీల పేర్లు గానీ వారి అధికారుల పేర్లు గానీ లేవని వెల్లడించారు. ఈ రెండు కీలకమైన నేరారోపణల్లో అదానీల పేర్లు లేవన్న సంగతిని అందరూ.. ముఖ్యంగా మీడియా గుర్తించాలని సూచించారు. బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఏం చెప్పారంటే...

➢ యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ మోపిన నేరారోపణ పత్రాన్ని నేను చదివా. ఆయా వ్యక్తుల నిర్దిష్ట చర్యలపై అభియోగాలు మోపుతూ మన దేశంలో దాఖలు చేసే చార్జిషీట్ లాంటిది ఇది. నా లెక్క ప్రకారం మొత్తం ఐదు నేరారోపణలున్నాయి. ఇందులో మొదటి, ఐదో నేరారోపణలు మిగిలిన వాటికన్నా చాలా ముఖ్యమైనవి. అయితే ఒకటో నేరారోపణలోగానీ ఐదో నేరారోపణలోగానీ అదానీ, ఆయన మేనల్లుడు పేర్లు లేనే లేవు. ఆ నేరారోపణలు మన దేశంలో దాఖలు చేసే చార్జిషీట్ లాంటివి. అది లంచం కావచ్చు.. దొంగతనం కావచ్చు.. హత్య కావొచ్చు. మొదటి నేరారోపణలో ఇద్దరు అదానీల పేర్లు లేవు. ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ) కింద ఈ నేరారోపణలు చేశారు. ఎఫ్‌సీపీఏ అనేది మన దేశంలో అవినీతి నిరోధక చట్టం లాంటిది. మొదటి నేరారోపణ ఏమిటంటే.. ఎఫ్‌సీపీఏని ఉల్లంఘించేందుకు కుట్ర పన్నారన్నది. ఇందులో అదానీల పేర్లు లేవు. వారి అధికారుల పేర్లు ఉన్నాయి. రెండు, మూడు, నాలుగో ఆరోపణలు సెక్యూరిటీలు, బాండ్లకు సంబంధించినవి. ఈ నేరారోపణల్లో అదానీలు, వారి అధికారుల పేర్లున్నాయి. ఐదవదైన చివరి నేరారోపణ చాలా ముఖ్యమైనది. ఈ నేరారోపణ న్యాయానికి ఆటంకం కలిగించారన్నది. ఇందులో అదానీల పేర్లు లేవు. వారి అధికారుల పేర్లు కూడా లేవు. అసలు ఎవరు ఎవరికి లంచం ఇచ్చారు..? ఎంత లంచం ఇచ్చారు..? ఎలా ఇచ్చారు... లాంటి వివరాల్లేవ్..!

➢ ఏది ఏమైనప్పటికీ ఈ ఆరోపణలపై అదానీలు తమకు తోచిన విధంగా స్పందిస్తారు. అలాగే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లపై సైతం వారు స్పందిస్తారు. నేను వారి స్పందనలను చూడలేదు. డీవోజే చార్జిషీట్‌ను పరిశీలించిన తరువాత నేను వ్యక్తిగతంగా వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలివి. ఓ చార్జిషీట్‌లో ఫలానా వ్యక్తులు ఫలానా పనులు చేశారు.. ఫలానా వ్యక్తులు ఫలానా వారికి లంచం ఇచ్చారు లాంటి వివరాలేవీ లేకపోవడం ఆందోళన కలిగించే విషయం. అదానీలు సౌర విద్యుత్ ప్రాజెక్టుల నిమిత్తం భారతదేశ వ్యక్తులకు, సంస్థలకు లంచం ఇవ్వజూపారన్నది ప్రధాన నేరారోపణ. అయితే ఆ నేరారోపణల్లో లంచం ఇచ్చేందుకు ప్రయత్నించారని ఉందే కానీ.. ఎవరికి లంచం ఇచ్చారు? ఎలా లంచం ఇచ్చారు? ఇందులో అదానీ గ్రూపు అధికారుల ప్రత్యక్ష ప్రమేయం ఉందా? ఎంత లంచం ఇచ్చారు? ఏ కాంట్రాక్ట్ కోసం లంచం ఇచ్చారు? అధికారులు ఏ గ్రూపునకు చెందిన వారు తదితర వివరాలేవీ కనీస స్థాయిలో కూడా లేవు. ఇందుకు సంబంధించి ఒక్కరి పేరు కూడా ఆ నేరారోపణల్లో లేదు. ఇలాంటి నేరారోపణలపై ఎవరైనా ఎలా స్పందిస్తారు? ఆ నేరారోపణల్లో ఎక్కడా కూడా ఇండియాలో లంచాలు ఇచ్చినట్లు లేదు. లంచం ఇచ్చేందుకు కుట్ర పన్నారన్నదే ప్రధాన నేరారోపణ. కానీ ఇందుకు ఎలాంటి ఆధారాలు లేవు. ఈ వ్యవహారంలో వారు (అదానీలు) అమెరికాలోని న్యాయవాదుల సలహాలు తీసుకుంటారని భావిస్తున్నా.

లంచం ఇవ్వాలని చూశారన్న ఆరోపణ మినహా అందుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవు. అందువల్ల ఆ నేరారోపణలన్నీ కూడా ఊహాజనితమైనవే. మరోసారి చెబుతున్నా.. 1, 5వ నేరారోపణల్లో అదానీల పేర్లు లేవు.

'సోలార్' లంచాలు.. ఊహాగానాలే

▶ మొదటి పేజీ తరువాయి

దానికి ఎలాంటి సాక్ష్యాధారాలూ చూపలేదని.. లోతుగా పరిశీలిస్తే ఇవన్నీ కేవలం ఊహాగానాలేనని స్పష్టమవుతోందన్నారు. ఇక ఈ కేసులో అత్యంత కీలకమైన 1, 5వ నేరారోపణల్లో అదానీ గానీ ఆయన మేనల్లుడు పేర్లు గానీ లేనే లేవని చెప్పారు. 'ఎఫ్‌సీపీఏ'ని ఉల్లంఘించారన్న నేరారోపణల్లోగానీ.. న్యాయానికి ఆటంకం కలిగించారన్న ఆరోపణల్లోగానీ అదానీల పేర్లు లేవనే విషయాన్ని వారు తెరపైకి తెచ్చారు. కీలకమైన ఈ రెండు నేరారోపణల్లో అదానీల పేర్లు లేవనే విషయాన్ని ప్రధానంగా మీడియా సంస్థలు గుర్తించాలని సూచిస్తున్నారు. అసలు లంచం ఇవ్వటానికి ప్రయత్నించారనిగానీ.. ఇచ్చారనిగానీ నిరూపించే కనీస సమాచారం కూడా లేదని పేర్కొంటున్నారు. ఆ నేరారోపణల్లో ఎక్కడా కూడా ఇండియాలో లంచాలు ఇచ్చినట్లు లేదని.. లంచం ఇచ్చేందుకు కుట్ర పన్నారన్నదే ప్రధాన నేరారోపణ అని.. అయితే అందుకు ఎలాంటి ఆధారాలు లేవనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. ఈ నేపథ్యంలో అమెరికా 'డీఓజే' నేరారోపణలకు బలం చేకూర్చే విశ్వసనీయమైన ఆధారాలేవీ లేవని ఈ కేసులో న్యాయపరమైన అంశాలను విశ్లేషించిన న్యాయ కోవిదులు చెబుతున్నారు.

అదానీపై ఆరోపణలు... భారత్‌పై విదేశీ శక్తుల కుట్ర

- సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మహేశ్ జఠ్మలానీ
- అది దేశాన్ని ఆర్థికంగా అస్థిరపరిచే యత్నం
- సౌర విద్యుత్ ప్రాజెక్టుల కోసం అదానీ గ్రూప్ భారత్‌లో అధికారులు, నేతలకు లంచాలిచ్చినట్టు డీఓజే అభియోగాల్లో స్పష్టంగా లేదు
- అందుకు ఒక్కటంటే ఒక్క ఆధారం కూడా చూపలేదు
- ఏ చట్టాలను ఉల్లంఘించారో ఒక్క అభియోగంలో కూడా లేదు

సాక్షి, అమరావతి: ''అదానీ గ్రూప్‌పై అమెరికా న్యాయ శాఖ (డీఓజే) చేసిన ఆరోపణలు, మోపిన అభియోగాలు కేవలం ఊహాగానాలు. పూర్తిగా నిరాధారం. పైగా వాటిని కూడా పూర్తిగా వక్రీకరించి మరీ భారత ప్రజల ముందు పెట్టారు. అదికూడా సరిగ్గా పార్లమెంటు శీతాకాల సమావేశాలు మొద లయ్యే ముందే వాటిని బయట పెట్టడం వెనక భారీ దురుద్దేశాలు దాగున్నాయి. ఇది భారత్‌ను ఆర్థికంగా అస్థిరపరిచేందుకు, దేశ కార్పొరేట్ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసేందుకు చేసిన ప్రయ త్నమే'' అని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మహేశ్ జఠ్మలానీ పేర్కొన్నారు. సౌర విద్యుత్ ప్రాజెక్టుల కోసం అదానీ గ్రూప్ భారత్‌లో అధికా రులకు, నేతలకు లంచాలిచ్చినట్టు డీఓజే తన అభియోగాల్లో ఎక్కడా స్పష్టంగా పేర్కొనలేదని జఠ్మలానీ గుర్తు చేశారు. తాను కేవలం ఒక జాతీయవాదిగా వ్యక్తిగత హోదాలో మాత్రమే దీనిపై స్పందిస్తున్నట్టు చెప్పారు. అంతేగానీ అదానీలకు గానీ, వారి గ్రూప్‌నకు గానీ మద్దతుగా మాట్లాడటం లేదని స్పష్టం చేశారు. అమెరికాలో జో బైడెన్ సారథ్యంలోని డెమొక్రటిక్ ప్రభుత్వానికి చెందిన అధికార లాబీలు ఏడాదిన్నరగా మోదీ సర్కారుకు పూర్తి వ్యతిరేకంగా పని చేస్తున్నాయన్నారు. 'అదానీ' వివాదంపై బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

విశ్వసనీయత లేదని ట్రంప్ చెప్పారు..



''అది పూర్తిగా అమెరికాలో అదానీ గ్రీన్ కంపెనీ జారీ చేసిన బాండ్లకు సంబంధించిన అంశం. ఇన్వెస్టర్లకు సమాచారమే ఇవ్వకుండా బాండ్లు జారీ చేశారని, భారత్‌లో కాంట్రాక్టులు పొందేందుకు లంచాలు ఆశచూపిన విషయాన్ని దాచి అమెరికాలో పెట్టుబడుల సేకరణకు ప్రయత్నం చేశారని అభియోగాలు మోపారు. కానీ అందుకు ఒక్కటంటే ఒక్క ఆధారం కూడా చూపలేదు. పైగా ఈ ఉదంతానికి సంబంధించి భారత్‌లో ఏ చట్టాలను ఉల్లంఘించారో కనీసం ఒక్క అభియోగంలో కూడా పేర్కొనలేదు. కనీసం ఉల్లంఘించినట్టు కూడా చెప్పలేదు. భారత్‌లో అధికారులకు గానీ, ప్రజాప్రతినిధులకు గానీ అదానీ గ్రూప్ లంచమిచ్చినట్టు ఎక్కడా నిర్దిష్టంగా చెప్పలేదు కూడా. 'లంచాలిచ్చారు, లేదా ఇస్తామని వాగ్దానం చేశారు' అంటూ చాలా పదాల కూర్పులో చాలా తెలివిగా వ్యవహరించారు. కేవలం కుట్ర జరిగి ఉంటుందని అభిప్రాయపడ్డారేగానీ దానికి ఎలాంటి సాక్ష్యాధారాలూ చూపలేదు. పైగా ఆ కుట్రను అమలు చేశారని కూడా చెప్పలేదు. లోతుగా చూస్తే ఇవన్నీ కేవలం అమెరికా న్యాయ శాఖ ఊహా గానాలేనని అడుగడుగునా స్పష్టమవుతూనే ఉంది'' అని జఠ్మలానీ స్పష్టం చేశారు. అమెరికాలో న్యాయ శాఖ అనేదే ఒక పెద్ద జోక్ అని, దానికి విశ్వ సనీయతే లేదని ఆ దేశానికి కాబోయే అధ్యక్షుడైన డొనాల్డ్ ట్రంపే చెప్పారని గుర్తు చేశారు.

అమెరికా కంపెనీల ఆధిపత్యానికి అదానీ గండి

అదానీ ఎపిసోడ్ మొత్తాన్నీ భారత్‌పై బైడెన్ సర్కారు పన్నాగంలో భాగంగా జఠ్మలానీ అభివర్ణించారు. ''భారత శత్రు దేశాలకు చెందిన పలు కంపెనీలతో పోటీ పడి విదేశాల్లో షిప్పింగ్ తదితర కాంట్రాక్టులను అదానీ చేజిక్కించుకుంది. ఇది కొందరికి చాలా కంటగింపుగా మారింది. అదానీలు గానీ, అదానీ గ్రీన్ కంపెనీ గానీ ఈ ఉదంతంలో భారత్‌లో ఏ అవకతవకలకూ పాల్పడలేదన్నది స్పష్టమవుతున్నా డీఓజే నిరాధార ఆరోపణలకు విలువనివ్వడం భారత ప్రయోజనాలకు ఏమాత్రం మంచిది కాదు'' అని అభిప్రాయపడ్డారు. ''గతంలో హిండెన్‌బర్గ్ ద్వారా కావచ్చు. ఇప్పుడు డీఓజే అభియోగాలు కావచ్చు. అదానీలపై ఆరోపణలు తెరపైకి వచ్చినప్పుడల్లా ఆ గ్రూపు ఆర్థికంగా భారీగా నష్టపోతూ వస్తోంది. ఈసారి ఏకంగా 2.4 బిలియన్ డాలర్లు నష్టపోయింది. పైగా హిండెన్‌బర్గ్ నివేదికైనా, డీఓజే అభియోగాలైనా పార్లమెంటు సమావేశాలకు సరిగ్గా రెండు రోజుల ముందు బయటికొచ్చాయి. ఇందులోకి కేంద్ర ప్రభుత్వాన్ని కూడా లాగే ప్రయత్నం చేస్తున్నారు. అదానీ గ్రూప్‌నకు ప్రధాని నరేంద్ర మోదీ బాగా సన్నిహితుడంటూ కాంగ్రెస్, విపక్షాలు చేస్తున్న ఆరోపణలు అందులో భాగమే. పలు అమెరికా కంపెనీల ఆధిపత్యానికి అదానీ గ్రూప్ గండికొట్టింది. ఆ దుగ్ధ డీఓజే ఆరోపణల వెనక స్పష్టంగా కనిపిస్తోంది. ఏ సాక్ష్యం లేకుండా కేవలం ఓ అభియోగ పత్రంపై ఆధారపడి నిరాధార ఆరోపణలు చేయడం కాంగ్రెస్ లాంటి పెద్ద పార్టీకి తగని పని'' అని జఠ్మలానీ పేర్కొన్నారు. డీఓజే అభియోగాల ఆధారంగా పార్లమెంటులో కాంగ్రెస్ చేస్తున్నదంతా వట్టి రాద్ధాంతమేనన్నారు. రిటైల్ ఇన్వెస్టర్లకు తీవ్ర నష్టం చేకూరుస్తోందని ఆవేదన వెలిబుచ్చారు. డీఓజే ఆరోపించినట్టుగా అదానీ ఉదంతంలో భారత్‌లో తప్పుడు వ్యవహారాలు జరిగినట్టు విశ్వసనీయమైన సాక్ష్యాలంటూ ఉంటే కాంగ్రెస్ ముందుగా వాటిని ప్రజల ముందు పెట్టాలని జఠ్మలానీ డిమాండ్ చేశారు.

సినీ రంగంలో అపార అవకాశాలు

- మ్యూజిక్ డైరెక్టర్ శశిప్రీతమ్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సినీ రంగంలో టెక్నికల్ కోర్సుల ద్వారా అపార అవకాశాలు ఉన్నాయని మ్యూజిక్ డైరెక్టర్ శశిప్రీతమ్ పేర్కొన్నారు. బుధవారం జేపీఎన్‌సీ కళాశాలలో విద్యార్థులకు పలు కోర్సులపై ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒక సినిమా తీయాలంటే దాని వెనుక అనేక టెక్నికల్ విభాగాలు పనిచేస్తాయని అన్నారు. అందులో డబ్బింగ్, యాంకరింగ్, సౌండ్‌సిస్టం వంటివి ఉంటాయన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్, స్పేస్ అకాడమీ వారు మూడు నెలల కోర్సులను అందజేస్తున్నారని అన్నారు. వీటిని పూర్తిచేస్తే హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా ఉపాధి, ఉద్యోగావకాశాలు పొందొచ్చని తెలిపారు. కార్యక్రమంలో న్యాక్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ శాంతిశ్రీ, ప్రిన్సిపాల్ సుజీవన్, సాయితేజ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు రాజా రాంచరణ్

- రెండోసారి రాష్ట్ర జట్టులో చోటు



మహబూబ్‌నగర్ క్రీడలు: కొంకుంట్ల మండల కేంద్రానికి చెందిన కె.రాజారాంచరణ్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కోల్‌కత్తాలో ఈనెల 29 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు జరిగే 39వ యూత్ నేషనల్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటాడు. హైదరాబాద్‌లోని కీస్టోన్ అకాడమీలో ప్రత్యేక కోచింగ్ క్యాంపులో మెరుగైన ప్రదర్శన కనబర్చాడు. రాంచరణ్ ఐదేళ్ల నుంచి బాస్కెట్‌బాల్‌లో విశేష ప్రతిభ కనబరుస్తున్నాడు. 2022లో పాండిచ్చేరిలో జరిగిన సబ్ జూనియర్ జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించాడు. ఆయన ఇప్పటివరకు ఆరుసార్లు రాష్ట్రస్థాయి టోర్నీల్లో పాల్గొన్నాడు. ఇటీవలే ఎస్‌జీఎఫ్ అండర్–17 విభాగం హైదరాబాద్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి రాష్ట్రస్థాయి టోర్నీలో జట్టు రన్నరప్‌గా నిలవడంలో తనవంతు పాత్ర పోషించాడు. రాంచరణ్ జాతీయస్థాయికి ఎంపికకావడంపై జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మక్సూద్ బిన్ అహ్మద్ జాకీర్, కార్యదర్శి నసరుల్లా హైదర్ హర్షం వ్యక్తంచేశారు.

దేశానికే ఆదర్శంగా కొల్లాపూర్



వేదికపై ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, మైహోమ్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, వలిపె రాంగోపాల్‌రావు, జాఫర్, కట్టా జయరాంరెడ్డి, సురభి ఆదిత్య లక్ష్మారావు, దయాసాగర్‌రావు, ఎల్లూరి శివారెడ్డి తదితరులు

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- అట్టహాసంగా ఆర్‌ఐడీ స్వర్ణోత్సవాలు ప్రారంభం
- హాజరైన ప్రముఖులు

కొల్లాపూర్: దేశానికే ఆదర్శంగా కొల్లాపూర్‌ను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని.. ఇందుకు అందరి చేయూత అవసరమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కొల్లాపూర్‌లో ఆర్‌ఐడీ స్వర్ణోత్సవాలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని సురభి రాజుల బంగ్లాలో పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. ఉత్సవాలకు పాఠశాల పూర్వ విద్యార్థులైన మంత్రి జూపల్లి కృష్ణారావు, మైహోమ్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, ఆయన సతీమణి శ్రీకుమారి, బిట్స్ పిలానీ వీసీ వలిపె రాంగోపాల్‌రావు, తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్‌చాన్స్‌లర్ ఎల్లూరి శివారెడ్డి, హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కట్టా జయరాంరెడ్డి, ప్రముఖ కార్డియాలజిస్టు దయాసాగర్‌రావుతో పాటు సురభి రాజవంశం వారసుడు ఆదిత్య లక్ష్మారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆర్‌ఐడీ అల్యూమ్ని వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డా.సాయిప్రసాద్ అధ్యక్షతన జరిగిన వేడుకలను మంత్రితో పాటు జూపల్లి రామేశ్వర్‌రావు దంపతులు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధితో పాటు కొల్లాపూర్‌లో విద్యాభివృద్ధికి తోడ్పడుతామని ఆర్‌ఐడీ పూర్వ విద్యార్థులందరూ ప్రతిజ్ఞ చేశారు. చనిపోయిన పూర్వ విద్యార్థులు, గురువులకు నివాళులర్పించారు. అంతకుముందు మైహోమ్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు రూ. కోటికి పైగా వెచ్చించి ఆధునికీకరించిన ఆర్‌ఐడీ పాఠశాల భవనాన్ని పూర్వ విద్యార్థులు సందర్శించారు.

● వేడుకల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. తనను తాను సంస్కరించుకొని సమాజాన్ని సంస్కరించాలని నెర్పేదే విద్య అని అన్నారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించాలన్నారు. తాము చదువుకునే రోజుల్లో కటికనేని పురుషోత్తం సార్ చెప్పే లెక్కలు ఇప్పటికీ గుర్తున్నాయని చెప్పారు. అభివృద్ధి అంటే సాగు, తాగునీరు, రోడ్లు మాత్రమే కాదని.. మానవీయ విలువలు, ధైర్యం, సాహసం, ఆత్మవిశ్వాసం కూడా అభివృద్ధే అని అన్నారు. తెలంగాణ తొలిదశ ఉద్యమంలో చాలా మంది తుపాకీ తూటాలకు బలయ్యారని.. మలిదశ ఉద్యమంలో ఎంతో మంది ఆత్మబలిదానాలు చేసుకున్నారన్నారు. కానీ ఇప్పుడు పరీక్షల్లో ఫెయిలైతే, ప్రేమ విఫలమైతే ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. ధైర్యం, సాహసం, ఆత్మవిశ్వాసం ఉంటే ఇటువంటి అఘాయిత్యాలకు పాల్పడరని మంత్రి వివరించారు. కొల్లాపూర్ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని పూర్వ విద్యార్థులను కోరారు.

పాత జ్ఞాపకాలు గుర్తుచేసుకున్న రామేశ్వర్‌రావు..

మైహోమ్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు తాను చదువుకున్న రోజులను గుర్తుచేసుకున్నారు. ఆర్‌ఐడీ పాఠశాలలో పదో తరగతి, జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్య అభ్యసించిన ఆయన.. తన అనుభవాలను వివరించారు. తాను చదువుకున్న పాఠశాలకు ఏదో ఒకటి చేయాలనే ఉద్దేశంతో ఆధునికీకరణ పనులు చేయించానని చెప్పారు. భవిష్యత్ తరాలకు గుర్తుండేలా అందరం కలిసి విద్యాభివృద్ధికి బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. వలిపె రాంగోపాల్‌రావు, కట్టా జయరాంరెడ్డి, ఎల్లూరి శివారెడ్డిలు తమ పాఠశాల రోజులను గుర్తు చేసుకున్నారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో రిటైర్డ్ డీఆర్‌ఓ మదన్మోహన్‌రావు, డీఈఓ గోవిందరాజులు, మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య, వైస్ చైర్‌పర్సన్ మహిమూదాబేగం, నాగరాజు, జాఫర్ సాహెబ్, కె.విమల, జగదీశ్వర్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.



ఉత్సవాలకు హాజరైన ఆర్‌ఐడీ పూర్వ విద్యార్థులు

విద్యార్థుల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?



మాట్లాడుతున్న బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

వనపర్తి టౌన్: గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఎమహేందర్ ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎ.రాజశేఖర్ గౌడ్ అధ్యక్షతన క్రియాశీల సభ్యత్వ నమోదుపై గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ చేపట్టిన సభ్యత్వ నమోదుకు రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభించిందన్నారు. రాష్ట్రంలో 36 లక్షల సభ్యత్వాలు కాగా.. వనపర్తి జిల్లాలో పార్టీ లక్ష్యానికి 80 శాతం పూర్తయినట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడమే ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రాన్ని ఉత్తర, దక్షిణ భాగాలుగా విడదీసి వివక్షకు గురిచేస్తే సహించమన్నారు. ఆదిలాబాద్ నుంచి పాలమూరు వరకు విద్యార్థుల శ్రేయస్సు కోసం ఒకే రకమైన ప్రోత్సాహం అవసరమన్నారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల మరణ వార్తలు చూసి తల్లిదండ్రులు తీవ్ర దిగ్భ్రాంతికి గురవుతున్నారన్నారు. గురుకులాల్లో నోడల్ అధికారులను నియమించడంతో పాటు పాఠశాలల్లో హడ్‌హక్ కమిటీలను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏం ఉద్ధరించారని విజయోత్సవాలు నిర్వహిస్తున్నారో చెప్పాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ, సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మెంటెపల్లి పురుషోత్తంరెడ్డి, బి.శ్రీశైలం కదిరె మధు, సుధీర్, అరవింద్ రెడ్డి, రాజశేఖర్, ఎద్దుల రాజు తదితరులు ఉన్నారు.

రన్నరప్‌గా పాలమూరు



అండర్ 19 షీల్డు అందుకుంటున్న ఫుట్‌బాల్ బాలుర రన్నరప్ పాలమూరు జట్టు

- ముగిసిన అండర్ –19 ఫుట్‌బాల్ టోర్నీ
- బాలుర విజేతగా హైదరాబాద్ జట్టు..
- బాలికల విజేతగా రంగారెడ్డి.. రన్నరప్‌గా నల్లగొండ

జడ్చర్ల టౌన్: ఎస్‌జీఎఫ్ 68వ అండర్–19 ఫుట్‌బాల్ బాలబాలికల మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. స్థానిక మినీ స్టేడియం మైదానంలో కార్యనిర్వాహకుడు మోయిన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నడుస్తున్న టోర్నమెంట్ బుధవారం ముగిసింది. బాలుర విభాగంలో హైదరాబాద్ విజేత కాగా రన్నరప్‌గా మహబూబ్‌నగర్ జట్టు, మూడో స్థానంలో నల్లగొండ జటట్టు నిలిచింది. బాలికల విభాగంలో రంగారెడ్డి జట్టు విజేత కాగా నల్లగొండ జట్టు రన్నరప్‌గా, మెదక్ జట్టు మూడో స్థానాన్ని దక్కించుకుంది. టోర్నీలో ప్రతిభ కనబర్చిన వారిలో 18మంది బాలురు, 18మంది బాలికలతో త్వరలో రాష్ట్ర జట్లను ఎస్‌జీఎఫ్ ప్రకటించనుంది. జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ టోర్నమెంట్‌కు ఎంపిక చేసినవారితో కూడిన జట్లను పంపించనున్నారు. ఎంపికైన వారికి వారం రోజులు శిక్షణ ఇవ్వనున్నారు.

నిరాశలో ఆతిథ్యజట్టు

అండర్–19 ఎస్‌జీఎఫ్ 68వ రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో బాలుర జట్టు ఫైనల్‌కు చేరినప్పటికీ నిరాశ తప్పలేదు. హైదరాబాద్ జట్టుతో 3గోల్స్ తేడాతో ఓటమి చవిచూసింది. దీంతో క్రీడాకారులు అసంతృప్తి చెందారు. బాలికల జట్టు నాలుగో స్థానంతో సరిపెట్టుకోవాల్సి రావటంతో ఆతిథ్య జట్టులో నైరాశ్యం నిండుకుంది.

వచ్చే బడ్జెట్‌లో క్రీడలకు నిధులు

- త్వరలోనే జీఓ నెం.10రద్దు
- పీఈటీల సమస్యలు పరిష్కారం
- వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

జడ్చర్ల టౌన్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో పీఈటీలు, పీడీల సమస్యలు పరిష్కారమవుతాయని, వచ్చే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యతో పాటు క్రీడలకు ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. జడ్చర్ల మినీస్టేడియంలో మూడురోజుల పాటు ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మోయిన్ కార్యనిర్వహణలో జరిగిన అండర్ –19 ఫుట్‌బాల్ బాలబాలికల రాష్ట్ర టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ముగింపులో భాగంగా విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల నిర్వహణకు పీఈటీలు, పీడీలు ఎంతో కృషి చేస్తున్నారని, చాలాచోట్ల సొంతంగా, దాతల సహాయంతో క్రీడలు నిర్వహిస్తున్నారన్నారు. ఇకపై ఇబ్బంది లేకుండా బడ్జెట్‌లో నిధులు కేటాయించబడ్డాయని, ఇందుకోసం సీఎంకు విన్నవించగా, సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రాష్ట్రంలో పదోన్నతులకు నోచుకోకుండా ఉన్న 114మంది పీఈటీల కోరిక నెరవేరబోతుందని, వారిని పీడీలుగా చూడబోతున్నామన్నారు. ఫిజికల్ డైరెక్టర్లకు జూనియర్ లెక్చరర్లుగా అవకాశం కల్పించాలని పోరాడుతున్నామని, అందుకు అడ్డుగా ఉన్న జీఓనెం. 10ని రద్దు చేయించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. జీఓనెం .10 రద్దు అయితే జీఓ నెం.79 ద్వారా పీడీలు జూనియర్ లెక్చరర్లుగా కళాశాలల్లోకి అడుగుపెడ్తారన్నారు. సమావేశంలో పీడీ, పీఈటీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్, కళాశాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాపిరెడ్డి, ఫిలెవాక్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, వార్డుకౌన్సిలర్ సతీష్, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.